## యోగా కొందరిది కాదు అందరిది..



-మానసిక ఉల్లాసానికి ఎంతో మేలు
-యోగా దినోత్సవంలో కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

2లో

ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 22 | జూన్ | 2024
పేజీలు 8

# లెటర్ ప్లీజ్..

**-గత ప్రభుత్వంలోనూ ఇదే తీరు**
**-పోస్టింగ్‌ల కోసం పోలీసుల యత్నాలు**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఎన్నికల కోడ్ పూర్తి కావడం ఇప్పటికే కలెక్టర్లు, ఎస్‌పిల బదిలీలు జరగడంతో ఇప్పుడు పోలీస్ శాఖలో కానిస్టేబుల్స్ నుంచి ఉన్నతాధికారుల దాకా బదిలీలు జరగనున్న నేపథ్యంలో పోలీసుల పైరవీలు జోరందుకుంటున్నాయి. ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. మీ పరిధిలో పని చేయడానికి అనుమతిస్తూ ఉన్నతాధికారులకు లేఖ ఇవ్వాలని కోరుతున్నారు. మీరు అనుమతిస్తే మీ పరిధిలో ఉద్యోగం చేసే అవకాశం దక్కుతుందని అందు కొరకు అవసరమైతే ఒక ఫోన్ చేయాలని కొందరు వేడుకుంటున్నారు. లూప్ లైన్‌లో ఉన్నపోలీస్ అధికారులు సైతం బదిలీల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ బదిలీల వ్యవహారం కేవలం ఖమ్మం, కొత్తగూడెం జిల్లాలకే పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ఇదే పరిస్థితి. తెలంగాణ లో కొత్త ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఆరు మాసాలు గడిచినా కొత్త ప్రభుత్వ మార్క్ పాలన ప్రారంభం కాలేదు. పార్లమెంటు ఎన్నికల కోడ్ సుదీర్ఘ కాలం కొనసాగడంతో కోడ్ ముగిసిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ నేపథ్యంలో పోలీస్ శాఖలో మిగిలిన సిబ్బంది బదిలీలు కూడా జరగ నున్నాయి. ఎన్నికల సందర్భంగా అటు ఇటు అయిన అధికారులు కూడా తిరిగి వారి స్థానాల్లో మార్పులు జరిగే అవకాశం ఉంది. కొన్ని పోస్టింగులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. గత ప్రభుత్వ ఎస్‌ఐ, సిఐ, ఏసిపి అధికారుల బదిలీల వ్యవహారం ఎంఎల్‌ఏల కు అప్పగించింది. స్థానిక శాసన సభ్యుని అనుమతి లేకుండా పోస్టింగులు ఇవ్వలేదు. దీనితో శాసన సభ్యుల పరిధిలో నియమించబడిన అధికారులు, శాసన సభ్యులు ఏమి చెబితే అదే చేశారు. ఈ వ్యవహారం రాజకీయ దుమారం లేపి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతను తీసుకు వచ్చింది. అధికార పార్టీ నేతలు చెబితే కేసులు నమోదు చేయడం, నిర్బంధానికి గురి చేశారు. కాని ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం శాసన సభ్యుల మాటకు విలువనిస్తే అదే పరిస్థితి పునరావృతమై ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉంది. అధికారుల్లో కూడా కొంత మంది ప్రభుత్వ అనుకూల వ్యతిరేక అభిప్రాయాలు కలిగి ఉండడంతో గత ప్రభుత్వంలో కొందరికి సరైన పోస్టింగులు దక్కక పోగా ప్రతిభ ఉన్న లూప్ లైన్‌లోనే చాలా కాలం బాధ్యతలు నిర్వర్తించాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా పోలీస్ పోస్టింగ్‌ల విషయంలోను సామాజిక అంశాలు పని చేస్తున్నాయన్న ఆరోపణలు కూడా వినవస్తున్నాయి. ఫలానా వ్యక్తి నా దగ్గరే పని చేయాలంటూ ఉన్నతాధికారులు ప్రభుత్వంపై కొందరు కాంగ్రెస్ ప్రతినిధులు ఒత్తిడి తీసుకు వస్తున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి. గత ప్రభుత్వంలో హల్‌చల్ చేసిన కొందరు పోలీస్ అధికారులను తమ వద్ద నియమించ వద్దంటూ కొందరు ఎంఎల్‌ఏలు ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఇక పైరవీలు లేక నిజాయితీగా ఎక్కడ అవకాశం ఇస్తే అక్కడ శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజలకు చేరువగా పని చేసే అధికారులు మాత్రం ఎక్కడైతే ఏమిలే మన పని



మనం చేసుకుపోదాం అన్న రీతిలో ఏ లేఖ కోసం ఎవరి చుట్టూ తిరగకుండా తమ పని తాము చేసుకుపోతున్నారు. గత ప్రభుత్వం మాదిరి శాసన సభ్యులకు అనుకూలమైన పోలీస్ సిబ్బందినే ఆ నియోజక వర్గ పరిధిలో నియమిస్తారా లేక నిబంధనలకు లోబడి బదిలీలు చేస్తారా అన్నది తేలాల్సి ఉంది.

## విజయవంతంగా ముగిసిన టియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలు



**-రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన రాంనారాయణ**
**-కార్యవర్గ సభ్యునిగా మాటేటి వేణుగోపాల్**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణరాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. ఖమ్మంలో 18, 19, 20 తేదీలలో కామ్రేడ్ అమర్‌నాథ్ ప్రాంగణం ఉషా హరి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన విషయం విధితమే. కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఢిల్లీ తదితర 10 రాష్ట్రాల సౌహార్ధ ప్రతినిధులు, ఐజెయు ప్రతినిధులు, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, జాతీయ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఈ మహాసభలకు హాజరయ్యారు. మహాసభలను పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించగా అతిథులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మీడియా

మిగతా 2లో..

## పప్పు దినుసుల సాగును పెంచాలి



**-కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**
**-పప్పు దినుసుల బోర్డును ఏర్పాటు చేయాలి**
**-మంత్రి తుమ్మల**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** రాష్ట్రాలలో పప్పు దినుసుల సాగును, వాటి విస్తీర్ణాన్ని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 10 రాష్ట్రాలకు సంబంధించిన వ్యవసాయ శాఖ మంత్రులతో ఆయా రాష్ట్రాలలో పప్పు దినుసుల సాగు వాటి విస్తీర్ణాన్ని పెంచే దిశగా చేపట్టాల్సిన చర్యల గురించి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ

మిగతా 2లో..

# విజయవంతంగా ముగిసిన టియుడబ్ల్యూజె రాష్ట్ర మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)
అకాడమీ ఛైర్మన్, ఐజెయు అధ్యక్షులు కె. శ్రీనివాసరెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర అధ్యక్షులు నగునూరి శేఖర్ అధ్యక్షతన జరిగిన మహాసభల్లో జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి అతిథులు హామీ ఇవ్వగా మహాసభ ఉద్యోగ భద్రత, కనీసవేతనం, జర్నలిస్టుల సంక్షేమం, అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు తదితర అంశాలు చర్చించి హక్కులు, సంక్షేమ సాధనకు మహాసభల్లో కార్యాచరణ రూపొందించారు. కార్యదర్శి విరహత్ అలీ ప్రవేశపెట్టిన కార్యదర్శి నివేదికపై విస్తృత స్థాయిలో చర్చ జరిగింది. వివిధ జిల్లాల ప్రతినిధులు చర్చలో పాల్గొని తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సంఘం బలోపేతం, జర్నలిస్టుల హక్కులు, సంక్షేమ సాధనే లక్ష్యంగా మహాసభలలో కార్యాచరణ రూపొందించారు. ఖమ్మంజిల్లా కమిటీ ఈ మహాసభలకు విస్తృత ఏర్పాట్లు చేసింది. ఎటువంటి లోటుపాట్లు లేకుండా మహాసభలను విజయవంతంగా నిర్వహించింది. నెల రోజుల పాటు 50 మంది జర్నలిస్టులు ఆహర్నిశలు కష్టపడి మహాసభలను విజయవంతం చేశారు. రాంనారాయణ నేతృత్వంలో అధ్యక్షులుగా కూరపాటి ప్రదీప్ కుమార్, కార్యదర్శిగా వనం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా ఏనుగు వెంకటేశ్వరరావు మరో 36 మందితో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది సబ్ కమిటీలను ఏర్పాటు చేసి ఒక్కో కమిటీలో ఐదారుగురు సభ్యులు ఈ మహాసభల విజయవంతానికి కృషి చేశారు. జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ఖమ్మం నియోజక వర్గ యూనియన్, టియుడబ్ల్యూజె వైరా యూనిట్లు మహాసభలకు పూర్తి స్థాయిలో సహకరించాయి.

**నూతన కమిటీ ఎన్నిక ...**

ఐజెయు అధ్యక్షులు, మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గతంలోనే సంఘం నియమ నిబంధనల ప్రకారం రాష్ట్ర అధ్యక్షునిగా కె. విరహత్ అలీ ఎన్నిక కాగా మహాసభల్లో చివరి రోజు గురువారం ప్రధాన కార్యదర్శితో పాటు ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు కార్యదర్శులు, కోశాధికారి తో పాటు 16 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

**ఖమ్మంకు తొలిసారి ...**

టియుడబ్ల్యూజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ కె. రాంనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాంనారాయణ సుదీర్ఘ కాలం యూనియన్‌కు దన్నుగా నిలిచారు. గతంలో యూనియన్ జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పని చేశారు. యూనియన్ సంక్లిష్ట స్థితిలో ఉన్న ప్రతిసారి దన్నుగా నిలవడమే గాక యూనియన్ బలోపేతానికి కృషి చేశారు. 1952లో ఏర్పడిన అప్పటి ఏపియుడబ్ల్యూజె ఆ తర్వాత రాష్ట్ర సాధన అనంతరం ఏర్పడిన టియుడబ్ల్యూజె లో ఖమ్మంజిల్లాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పదవి దక్కడం ఇదే తొలిసారి. ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నిక కావడం పట్ల ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నేతలు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు ఆయనకు అభినందనలు తెలిపారు.

**రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మాటేటి వేణుగోపాల్ :**

టియుడబ్ల్యూజె (ఐజెయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా ఖమ్మంకు చెందిన మాటేటి వేణుగోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వేణుగోపాల్ మూడు దశాబ్దాలుగా యూనియన్‌లో వివిధ హోదాలలో పని చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యునిగా ఎలక్ట్రానిక్ మీడియా బాధ్యునిగా పని చేసిన వేణు గోపాల్ గత కొంత కాలంగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పని చేస్తున్నారు.ఆయన ఎన్నిక పట్ల పలువురు అభినందించారు. వేణు మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు.

# యోగా కొందరిది కాదు అందరిది..

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యోగా కొందరిది కాదని ఇది అందరిదని ఒక కులం, మతం, వర్గం భాషకు సంబంధించిది కాదని ఎన్నో ఏళ్ల నుంచి తర తరాలుగా వస్తుందని పెద్దలు ఇచ్చిన ఆస్తిగా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అభివర్ణించారు. 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా శుక్రవారం సర్దార్ పటేల్ మైదానంలో జిల్లా ఆయుష్, యువజన క్రీడల శాఖలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తో కలిసి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం యోగా సాధకుల ను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ మనమందరం ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక శ్రమ ఒక్కటే సరిపోదని మానసికంగా కూడా ఆరోగ్యంగా ఉండాలన్నారు.ఆందోళనలు, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఏ సమస్యనైనా పరిష్కరించే ధైర్యం యోగా మాత్రమే అన్నారు. వివిధ రకాల వ్యాయామాలతో మానసిక ధృడత్వాన్ని పొందుతామని తద్వారా పూర్తి ఆరోగ్యంగా జీవిస్తామన్నారు. సమయం కుదరడం లేదని అంటుంటారని పరిస్థితిని బట్టి ఒకటి రెండు నిమిషాలు కూడా యోగ చేయవచ్చునన్నారు. ఒత్తిడిని జయించి మానసిక ప్రశాంతతను పొంది శరీర ధృడత్వం రావాలంటే యోగ తప్పనిసరి అన్నారు. 2024



సంవత్సరానికి అంతర్జాతీయ యోగా దినోత్సవంను యోగా ఫర్ సెల్ఫ్ అండ్ సొసైటీగా చెప్పడం జరిగింది. కాబట్టి ప్రతి ఒక్కరూ ఈరోజు నుండి తప్పనిసరిగా ఎంతో కొంత సమయం యోగా కోసం కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి సునీల్ రెడ్డి, లక్ష్మి నారాయణ, డాక్టర్ రాంచందర్ రావు, డాక్టర్ రవికుమార్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ స్వామి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పప్పు దినుసుల సాగును పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)
పెరుగుతున్న అవసరాల దృష్ట్యా దేశంలో పప్పు దినుసుల సాగును పెంచాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. పప్పు దినుసుల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వ విధి విధానాలు ఉంటాయని తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పండించే తాండూరు కందిపప్పుకు ప్రపంచంలోనే విశిష్ట స్థానం ఉందని ప్రతి ఏడాది 4లక్షల క్వింటాళ్ల కందిపప్పు అక్కడ నుంచి మార్కెట్‌కు వస్తుందని తెలిపారు. దానిని మరింత ప్రోత్సహించేందుకు అక్కడ పప్పు దినుసుల బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. పప్పు దినుసుల సేకరణకు సంబంధించి విధించిన 25 శాతం పరిమితిని ఎత్తివేసి 100 శాతం చేపట్టాలని కోరారు. దీని వల్ల పప్పు దినుసుల పంటను సాగు చేసే రైతులకు ప్రోత్సహకరంగా ఉంటుందని మార్కెట్‌లో తలెత్తే ఒడుదుడుకులను తట్టుకోగలరని మంత్రి తెలిపారు. పప్పు దినుసుల సాగు చేపట్టే రైతులకు జాతీయ ఆహార భద్రత మిషన్ కింద ఉత్పాదకాలకు ఇచ్చే సబ్సిడీని కూడా పెంచాలని మంత్రి కోరారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాల ప్రకారం పప్పు దినుసుల సాగును ప్రోత్సహించేందుకు ముఖ్యంగా వరి మాగాణిలో మొదటి పంట తర్వాత పప్పు దినుసుల సాగు చేపట్టేవిధంగా ప్రణాళిక చేశామని తెలిపారు. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆయిల్ పాం సాగును, రెండేళ్ల ప్రగతిని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో 30 ఏళ్ల నుండి ఆయిల్ పాం సాగులో ఉండగా తెలంగాణలో మూడేళ్ల నుంచి ప్రారంభమైందని ఆయిల్ పాం సాగు చేపట్టే రైతులకు మరింత ప్రోత్సహకం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ధర గిట్టుబాటు అయ్యేలా చూడాలని కోరారు. కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ఢిల్లీకి వచ్చి అన్ని విషయాల గురించి వివరించాల్సిందిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కేంద్ర మంత్రి సూచించారు.

# న్యూలిటిల్ ఫ్లవర్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/వైరా:** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు , ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ యోగాలో పాల్గొని యోగా ప్రాముఖ్యతను ప్రాధాన్యతను గురించి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కరస్పాండెంట్ డాక్టర్ పి.భూమేష్‌రావు మాట్లాడుతూ భారతదేశంలో 5000 సంవత్సరాల క్రితం యోగా ఉద్భవించిందని ఇది శారీరక భంగిమలు, శ్వాస వ్యాయామాలు, ధ్యాన్యాన్ని మిళితం చేస్తుందని మాట్లాడారు. పార్కులు, కమ్యూనిటీ సెంటర్లు బహిరంగ ప్రదేశాల్లో ప్రజలందరూ కలిసి యోగ సాధన చేస్తున్నారని దైనందిన జీవితంలో మనిషి ఎంతో ఒత్తిడికి గురవుతున్నాడు. ఆ ఒత్తిడిని దూరం చేసుకోవాలని అంటే యోగా సాధన ఒక్కటే మార్గమని సూచించారు. ప్రతిరోజు యోగా చేయడం వలన మానసిక శారీరక రుగ్మతలను




దూరం చేసుకోవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు , విద్యార్థులు పాల్గొన్నారు.

## జబర్దస్త్ సహ నటుడు మృతి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జబర్దస్త్ సహ నటుడు, స్క్రిప్ట్ రైటర్ మేదర మహ్మదీన్ రైలు ఎక్కతూ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందాడు. షూటింగ్ నిమిత్తం శుక్రవారం తెల్లవారు ఝూమున కాకతీయ ఎక్స్‌ప్రెస్ ఎక్కి హైదరాబాద్ వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు కదులుతుండగా ఎక్కే ప్రయత్నం చేయడంతో ప్రమాదశాత్తు జారిపడి ప్లాట్‌ఫాం ట్రైన్‌కి మధ్యలో ఇరుక్కుపోయాడు. గమనించిన రైల్వే సిబ్బంది ప్రయాణికుల ఆయనను బయటకు తీసి చికిత్సల నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు, కొత్తగూడెం లోని హౌసింగ్ బోర్డుకు చేందిన మహమ్మద్దీన్‌కు భార్య తో పాటు ఇద్దరు ఆడ పిల్లలున్నారు.

## 11వసారి రక్తదానం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు పట్టణంలోని చేతన మీసేవా నిర్వాహకుడు భూక్యా రంజిత్ నాయక్ తన ఓ పాజిటివ్ రక్తాన్ని 11వ ఇచ్చారు. పట్టణానికి చెందిన శంకరా చారి అనే వ్యక్తి జాగృతి ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నాడు. ఆపరేషన్ నిమిత్తం ఆయనకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్త కావాల్సి ఉండటంతో రంజిత్‌ను సంప్రదించారు. దీంతో ముందుకు వచ్చిన ఆయన 11వ సారి తన రక్తాన్ని దానం చేశారు. దీంతో వైద్యులు దైవరాజ్‌తోపాటు రోగి బంధువులు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా చేయి విరిగిన పేద యువకునికి వైద్యం చేయించి మానవత్వాన్ని చాటుకున్నారు. రంజిత్ మీసేవా నిర్వహణతో పాటు పలు సామాజికి కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఆర్థిక సహాయాలు అందజేస్తూ ఆదర్శంగా నిలిస్తున్నాడు. ఈయన ఓ ప్రముఖ దినపత్రికలో క్రైం రిపోర్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.

## ఘనంగా యోగా డే

**ప్రజాపక్షం/భద్రాచలం :** స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆయుష్ డిపార్ట్ ఆధ్వర్యంలో ఘనంగా యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎంఓ డా. రాజశేఖర్ రెడ్డి ముఖ్యాతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఆయుష్ డాక్టర్లు, సిబ్బంది పాల్గొనగా యోగా గురువు కృష్ణ యోగాసనాలు వేయించారు.



## రామయ్యను దర్శించుకున్న బదిలీ పీఓ ప్రతీక్ జైన్

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామచంద్ర స్వామివారిని ఐటిడిఏ పిఓగా పనిచేసి కలెక్టర్‌గా బదిలీ వెళుతున్న ప్రతీక్ జైన్ దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ తారాయమ్మ,



శ్రీ అభయాంజనేయ స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం తరుపున ఆయనకు షాలువా కప్పి జ్ఞాపికలను అందజేశారు.

# విత్తనాలు, ఎరువులకు బిల్లులు ఇవ్వాలి

**విత్తన, ఎరువుల షాపులను తనిఖీ చేసిన కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : విత్తన విక్రయ షాపుదారులు రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు సంబంధించి బిల్లులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. తీసుకున్న బిల్లులను, ఖాళీ ప్యాకెట్లను పంట సీజన్ పూర్తయ్యే వరకు రైతులు భద్రపర్చుకునేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ఖమ్మంలోని బర్మాషెల్ రోడ్డు, గాంధీచౌక్‌లోని లక్ష్మి వెంకటరమణ సీడ్స్, ఉషశ్రీ మార్కెటింగ్ ఏజెన్సీ, లక్ష్మి మణికంఠ ఏజెన్సీ విత్తన, ఎరువుల విక్రయ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా షాపులలో ఉన్న విత్తనాలు, నిల్వ వివరాల బోర్డులను పరిశీలించారు. షాపులలో స్టాక్ రిజిస్టర్, ఇన్వాయిస్ బుక్, బిల్ బుక్కులను, విత్తన బస్తాలపై లాట్ నెంబరు, ఎంఆర్‌పి రేటు, బ్యాచ్ నెం. గడువు తేదీ తదితర వివరాలను పరిశీలించారు. ఎరువులు, విత్తన అమ్మకాలకు తగిన అనుమతులు పొందిన పత్రాలను పరిశీలించి దుకణాదారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు ఏఏ ప్రాంతాల నుంచి వస్తున్నది, ఏఏ రకాలు అడుగుతున్నది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇతర షాపులకు అమ్మినది, రైతులకు నేరుగా అమ్మినది, రిజిస్టర్లను విడివిడిగా నిర్వహించాలన్నారు. జిల్లాలో ఏఏ కూరగాయలు పండిస్తారు, పూల సాగు చేస్తున్నది, ఏఏ విత్తనాలు ఎక్కువగా అడుగుతున్నది, మార్కెటింగ్ ఎక్కడ చేసేది వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతుల ఎక్స్‌పోజివ్ సందర్శనలు చేపట్టాలని, సాగులో సక్సెస్ అయిన రైతుల అనుభవాలను ఇతర రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో నేరుగా విత్తనాల విక్రయం జరుగుతున్నదా రైతులు ఎవరైనా దృష్టికి తేస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. షాపుల వద్దకు విత్తనాల కొనుగోలుకు వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చింది, ఏ పంట సాగు చేస్తుంది, గత సీజన్‌లో ఏ పంట సాగు చేసింది, ఏ రకం విత్తనాలు కొంటుంది, షాపు వారు ఎంఆర్‌పి రేట్లపై ఇస్తున్నారా అదనంగా అడుగుతున్నారా వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాగులో ట్రాన్స్ ప్లాంట్, బ్రాడ్ కాస్ట్, డ్రమ్‌సీడ్ పద్దతుల్లో ఏ పద్దతికి ఎంత పెట్టుబడి, దిగుబడి వివరాలు సమర్పించాలని, ఏ పద్ధతి లాభదాయకంగా ఉంటుందో ఆ పద్దతిలోసాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయ అధికారుల తనిఖీలు షెడ్యూల్ ప్రకారం, షాపుల తనిఖీలు పకడ్బందీగా చేయాలన్నారు. జిల్లాలో విత్తనాలకు ఎలాంటి కొరత లేదని అన్ని రకాల విత్తనాలు అందుబాటులోఉన్నాయని ఆయన తెలిపారు. రైతులు ప్యాక్ చేసిన విత్తనాలను మాత్రమే కొనాలని, లూజ్ విత్తనాలు, సీల్ తీసిన విత్తనాలు కొనవద్దని సూచించారు. విత్తనాలు కొనే ముందు రైతులు హోలోగ్రామ్ చూసి కొనాలని తెలిపారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలోను, రైతు వేదికల వద్ద రైతులకు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, సహాయ సంచాలకులు ఎ. శ్రీనివాసరావు, ఖమ్మం అర్బన్ మండల వ్యవసాయ అధికారి కిషోర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# నీట్ లీకేజీపై సమగ్ర విచారణ జరిపించాలి

**-ఎన్‌టిఏను రద్దు చేయాలి**
**-కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి**
**-విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, స్టూడెంట్ మార్చ్**





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నీట్ పేపర్ లీకేజీ పై సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని విద్యార్థి, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. నీట్ లీకేజీపై విచారణ జరిపించాలని ఎన్‌టిఏ ను తక్షణమే రద్దు చేయాలని విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని తదితర డిమాండ్లతో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, యూత్ కాంగ్రెస్, పిడిఎస్‌యు, పివైఎల్, పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఎస్ఆర్అండ్ బిజిఎన్ఆర్ కళాశాల నుంచి జెడ్పి సెంటర్ వరకు భారీ ర్యాలీ, స్టూడెంట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఇటికాల రామకృష్ణ, నానబాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, షేక్ బషీరుద్దీన్, ఆసీఫ్, యడ్లపల్లి సంతోష్, వి. వెంకటేష్, ఎన్వి రాకేష్, మస్తాన్, కూరపాటి రమేష్ తదితరులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నీట్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతుంటే కనీసం దేశ ప్రధాని, బిజెపి నాయకత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. బిజెపి అధికారంలో ఉన్న బీహార్, గుజరాత్ వంటి రాష్ట్రాల్లో పేపర్ లీకేజీ అయిందని ఇందులో బిజెపి నేతల ప్రమేయం ఉందని వారు ఆరోపించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) వెంట బిజెపి ఏజెన్సీగా మారిందని ఎన్‌టిఏను తక్షణమే రద్దు చేయాలన్నారు. నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనా మా చేయాలని వారు డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ పై ప్రధాని మోడీ, బిజెపి స్పందించకపోగా సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదని వారు ప్రశ్నించారు. వెంటనే సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఎన్‌టిఏను తక్షణమే రద్దు చేయడంతో పాటు లీకేజీ సూత్రదారులపై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి, యువజన సంఘం నాయకులు దాసోజు శ్రావణ్, మడుపల్లి లక్ష్మణ్, చింతల రమేష్, పి. సుధాకర్, లక్ష్మన్, ఉమా శంకర్, సంగీత, బోల్లం మహేష్, ఉదయ్‌కిరణ్, గంగాధర్, వీరబాబు, శ్రీను, సాయి, ప్రేమ్, నవీన్, వినోద్, మధు, శివ, గౌతమ్, నాగులమీరా, గోపి, ఉపేందర్, పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో మానసిక ప్రశాంతత



ప్రజాపక్షం/ తల్లాడ : యోగా చేయటం వలన మానసిక ప్రశాంతత లభిస్తుందని, యోగాను మన జీవన విధానంలో ఒకటిగా మార్చుకోవాలని బిజెపి పార్టీ మండల అధ్యక్షులు ఆపతి వెంకటరామారావు పేర్కొన్నారు. మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా తల్లాడ మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా యోగా విశిష్టతను గ్రామస్థులకు వివరించారు. గత పది సంవత్సరాల నుండి భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన కాలం నుండి నేటి వరకు యోగాను ప్రజల వద్దకు తీసుకు వెళ్లడం జరిగిందని తెలిపారు. యోగాను ప్రపంచ దేశాల ప్రజలకు పరిచయం చేసి అంతర్జాతీయ స్థాయిలో యోగాకు గుర్తింపు తెచ్చిన ఘనత ప్రధాని మోడీకే దక్కుతుందన్నారు. ప్రతిఒక్కరూ యోగాను అలవాటుగా మార్చుకుని మానసిక రుగ్మతలను దూరం చేసుకోవటానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చల్లా నాగులు, బిజెపి నాయకులు గాద కృష్ణారావు, చల్లా కిరణ్, ఎల్లంకి సుధాకర్, చల్లా కృష్ణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో యోగా దినోత్సవం



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : యోగాతో శారీరక, మానసిక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని యోగా గురువు బి. సురేష్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ సందర్భంగా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగా అనేది భారతదేశంలో ఉద్భవించిన పురాతన భౌతిక, మానసిక, ఆధ్యాత్మిక అభ్యాసమని ఆయన తెలిపారు. యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని శ్వాస, వ్యాయామాలతో కూడుకున్నదన్నారు. మనసులో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి నిరాశ, నిస్పృహల నుంచి బయటకు తీసుకు రావడానికి ఉపయోగపడుతుందన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు కామరాజు, శ్రీశైలం, సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ : ఖమ్మం రూరల్ మండలంలో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోలేపల్లిపంచాయతీపరిధిలోని గురుదక్షిణ ఫౌండేషన్‌లో ప్రతిరోజు యోగా చేసే 150మంది స్త్రీ,పురుషులు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అలాగే మంగళగూడెంలోని హైస్కూల్‌లో విద్యార్థులు యోగాలో పలు ప్రదర్శనలు,సాధనలు చేశారు. తొలుత యోగాడే శాంతి కపోతం పాటను రాసిన కే సీతారాములు సాధన బృందంతో ఆలపించారు. ఈ కార్యక్రమాలలో గురుదక్షిణ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు యాదగిరి. డివిజన్‌రెడ్డి, శ్రీనివాసరావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్ పంపిణీ



ప్రజాపక్షం/ చింతకాని : చింతకాని మండలం బస్వాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఖమ్మం యూత్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగ్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం రుద్ర ఇందిర అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో ఖమ్మం యూత్ అసోసియేషన్ బాధ్యులు మాట్లాడుతూ తమకు చేతనైనా విధంగా సామాజిక సేవ చేయాలనే దృక్పథంతో యువత ఒక గ్రూపుగా ఏర్పడ్డామని, గత ఏడేళ్లుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కావాల్సిన బోధనాభ్యసన సామాగ్రి,నోట్ బుక్స్ స్కూల్ బ్యాగ్స్ వంటివి ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ వారిని పాఠశాల హెచ్ఎం, ఇతర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో కోదుమూరు స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంపిటిసి కొరివి, వీరమ్మ, పాఠశాల ఎపిపిసి అధ్యక్షరాలు ఆవుల అల్లెమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండల పరిధిలోని 18 గ్రామ పంచాయితీలో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను మండల పరిషత్ అభివృద్ధి అధికారి జమలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధి హామీ పనులను నిర్వహించే ప్రదేశంలో కూలీలతో యోగా వల్ల కలిగే లాభాలను వివరించడంతో యోగాసనాలను నేర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తికి యోగా ఎంతో అవసరమని యోగా వలన మానసిక ప్రశాంతతతో పాటుగా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండటానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం యువకుడు, పెద్దలు అందరు కూడా యోగా వైపు నడుస్తున్నారని, గతంలో కంటే ప్రస్తుతం యోగాకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. ప్రభుత్వం యోగాన్ని గుర్తించి యోగా దినోత్సవం సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంపొందించుకోవటానికి ప్రజలందరి ఆరోగ్యాలు మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో మానసిక ప్రశాంతతతో పాటు మనశ్శాంతి కోసం యోగా ఉపయోగంగా ఉంటుందని అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో విజయలక్ష్మీ , పంచాయితీ కార్యదర్శులు, ఈసీ వెంకట్, టెక్నికల్ అసిస్టెంట్‌లు స్వాతి, వెంకటలక్ష్మీ , సుమ, కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్‌కి నివాళులర్పించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/దమ్మపేట:** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని గండుగులపల్లి క్యాంప్ ఆఫీసులో శుక్రవారం ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘన నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన జీవితాన్ని తెలంగాణ కోసం అంకితం చేసిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు

## సర్వరోగ నివారిణి యోగా

**ప్రజాపక్షం/దమ్మపేట:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శుక్రవారం దమ్మపేట మండల వ్యాప్తంగా యోగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు మాట్లాడుతూ మన సంస్కృతి మేధాశక్తిని ప్రపంచానికి యోగా చాటి చెబుతోందని పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వైస్ ఎంపీపీ మండల కేంద్రంలోని గాయత్రి ఆశ్రమంలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ యోగాను ఉద్యమంగా చేపట్టి నిర్వహించిన తీరుతో ప్రపంచ దేశాల్లో యోగా అంతర్జాతీయ యోగా దినోత్సవంగా మరింత ప్రసిద్ధిగాంచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు దారా నాగేశ్వరరావు, ఎల్ఐసీ వేణు, అత్తులూరి పాపారావు, పసుమర్తి వీరేశ్వరరావు, మాడా వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## 24న నిరసన ప్రదర్శనను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** ఈనెల 24న ఐటిడిఏ కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన జయప్రదం చేయాలని టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు జోగ రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆశ్రమ హై స్కూల్ మర్కోడు నందు మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఐటిడిఏ పరిధిలో గల ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలని నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖ, విద్యారంగ, ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమాలు ఉధృతంచేయాలని పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖలో సవరించిన సర్వీస్ రూల్స్ వెంటనే ప్రకటించాలన్నారు. బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరారు. జీవో 317 అప్పీళ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో టిపిటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి చాట్ల శ్రీనువాసరావు, ప్రధానోపాధ్యాయులు బావ్‌సింగ్, లక్ష్మీ బాయమ్మ, హైమావతి, పూర్ణ, నాగమణి, భానుచందర్, జోగయ్య, రాంబాబు, కవీందర్, వసంతరావు, వెంకన్న, రవీందర్, బాలకృష్ణ పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 12 గ్రామ పంచాయితీ పరిధిలో యోగా దినోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ఎంపిడివో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రతి వ్యక్తికి యోగా ఎంతో అవసరమని, యోగా వలన మానసిక ప్రశాంతతతో పాటుగా ఉత్సాహంగా ఉల్లాసంగా ఉండటానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రస్తుతం యువకులు, పెద్దలు అందరు కూడా యోగా వైపు నడుస్తున్నారని, గతంలో కంటే ప్రస్తుతం యోగాకి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని గతంలో యోగా పట్టణాలలోనికే పరిమితమైందని నేడు గ్రామీణ ప్రాంతాలలో మారుమూల ప్రాంతాల్లో కూడా యోగా ఆసనాలు యోగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈకార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, స్థానిక హెచ్ఎం శాంతయ్య, ప్రభుత్వ వైద్యాధికారి రేవంత్, డిప్యూటీ తహసీల్దార్ అనూష, పంచాయితీ కార్యదర్శులు రమేష్, నాగరాజు, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, జీవన్, సతీష్, అన్వేష్, విజయ్‌కుమారి, జబ్బర్ త్రివేణి, కార్యాలయ సిబ్బంది మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి రవాణా కట్టడికి చర్యలు తీసుకోవాలి

### పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గంజాయి రవాణా కట్టడికి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశించారు. మాదక ద్రవ్యాలు, గంజాయి సరఫరా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పెండింగ్ గంజాయి కేసులపై శుక్రవారం పోలీస్ యంత్రాంగంతో సిపి సునీల్ దత్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ సరిహద్దు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి విస్తృతంగా వాహనాలను తనిఖీ చేయడం ద్వారా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయగలమని తెలిపారు. రైలు మార్గాలతో రోడ్డు రవాణా సదుపాయాలు ఉన్న సరిహద్దు రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా ఇతర రాష్ట్రాలకు తరలించే గంజాయి అక్రమ రవాణాను స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్ బృందాలు దృష్టి సారించి సరఫరా మూలాలను కనిపెట్టి వ్యాపారులపై పిడి యాక్ట్ నమోదు చేయాలని సిపి ఆదేశించారు. అదేవిధంగా వినియోగదారుల నుంచి విక్రయదారుల వరకు సరఫరా లింకులపై పోలీసులు డేగ కన్ను ఉంచాలని సూచించారు. పనుల కోసం ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు, విద్యార్థులు యువతను ఆసరాగా చేసుకున్న కొందరు గంజాయి స్మగ్లర్లు గంజాయిని అందజేసేందుకు పాన్ డబ్బాలను అడ్డాలుగా మార్చుకుంటున్నట్లు సమాచారం ఉందని ఆయా అడ్డాలలో నిఘా పెట్టాలని ఆదేశించారు. గంజాయి మత్తుకు అలవాటైన యువత, కార్మికులు తమ స్నేహితులతో కలిసి పట్టణ, శివారు ప్రాంతాలలో దమ్ము కొట్టేందుకు సిద్ధపడుతున్నారని పట్టణ శివార్లలో నిఘా పెంచి అట్టి వారిని అదుపులోకి తీసుకోవాలని తెలిపారు. కళాశాలల్లోకి ఈ విష సంస్కృతి విస్తరిస్తే ఒక విద్యార్థిని చూసి మరొకరు గంజాయికి అలవాటుపడే ప్రమాదం ఉంటుందని కాబట్టి క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సిపి సూచించారు. డ్రగ్స్ వాడకం వల్ల జరిగే దుష్పరిణామాల గురించి స్కూళ్లు, కాలేజీలు, పబ్లిక్ ప్రదేశాల్లో అవగాహన కల్పించాలన్నారు.ఈ సమావేశంలో ఎస్‌బి ఎసిపి ప్రసన్నకుమార్, సిఐ స్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పూర్వ విఆర్‌వోల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పూర్వ విఆర్‌వోల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం తెలంగాణ పూర్వ విఆర్‌వోల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్రరావు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం పూర్వ విఆర్‌వోలను రీప్లేస్‌మెంట్ పేరుతో లాటరీ విధానంలో ఏకపక్షంగా, నియంతృత్వంగా రెవెన్యూ శాఖ నుంచి తప్పించి వేర్వేరు శాఖలకు బదిలీ చేసిందన్నారు. దాని ద్వారా విఆర్‌వోల జీవితాలు, హక్కులు కాలరాయబడ్డాయన్నారు. ఇతర సంస్థలకు విఆర్‌వోలను బదిలీ చేయడం వల్ల 010 పద్దు, ఐఎఫ్ఎంఐఎస్ ద్వారా జీతాలు పొందడం లేదని మా వేతనం నుంచి జిపిఎఫ్, సిపిఎస్, పిఎస్‌జిఎల్ఐ చందా చెల్లింపులు నిలిచిపోయాయన్నారు. వీటి వల్ల మా పదవి విరమణ అనంతరం సామాజిక భద్రత ప్రమాదంలో పడిందన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు ప్రభుత్వం ప్రకటించిన ఐదు శాతం ఐఆర్ పెంపుదలకు అర్హులు కావడం లేదని, కారుణ్య నియమాకాలకు వెసులుబాటు లేదన్నారు. పాత డిఏ, పిఆర్‌సి, ఇతర బకాయిలు రావడం లేదన్నారు. తక్కువ పోస్టులకు బదిలీ చేశారని తెలిపారు. కొంత మందిని నిబంధనలకు విరుద్ధంగా పొరుగు జిల్లాలకు, సుదూర ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ప్రభుత్వం దృష్టికి నివేదించి పరిష్కారానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఉపేంద్రరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంకా కృష్ణ, షేక్ జానిమియా, వాంకుడోత్ వెంకన్న, దరావత్ భాస్కర్, రాజారత్నం, రాంబాబు, అంగోతు ఉపేందర్, షేక్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

## హిందీకి మారు పేరు మోహన్





### -రాష్ట్రస్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డ్‌తో పాటు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరెన్నో అవార్డులు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆయన హిందీ బోధనలో ప్రత్యేకం. ఆయన హిందీ బోధిస్తారు అనే బదులుగా హిందీకి మారు పేరుగా మోహన్ అని అనుకుంటే సరిపోతుందనే మాట ఆయన పని చేసిన ప్రతి చోట వినిపిస్తుంది. ఆయన విద్యార్థులకు హిందీ బోధించే పద్ధతికి విద్యార్థులు సైతం ఫిదా. ఆయన బోధించే తీరు చూసిన విద్యార్థుల తల్లిదండ్రులు సైతం అభినందన వర్షం కురిపిస్తారు. సుమారు 12 సంవత్సరాల హిందీ భోదన చేస్తున్న ఆయనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉపాధ్యాయుల పదోన్నతులలో ఆయనకు దక్కిన గౌరవం. శుక్రవారం మోరంపల్లిబంజర్ జెడ్పిహెచ్ఎస్ పాఠశాల నందు ఆయన అసిస్టెంట్ హిందీగా బాధ్యతలను స్వీకరించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన హిందీ పండిట్‌గా 12 సంవత్సరాల ప్రయాణంలో ఎంతో మంది విద్యార్థులకు చేయూతను అందించారు. ఆయన పని చేసిన ప్రతి చోట పాఠశాలలను రాష్ట్ర స్థాయి స్వచ్ఛ విద్యాలయ అవార్డులతో పాటు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును సాధించారు. ముఖ్యంగా ఆయన నేతృత్వంలో ఎంతో మంది విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని గురుకులాలలో సీట్లు సాధించారు. సోంపల్లి గ్రామ పంచాయితీలోని ఎంపియూపిఎస్ పాఠశాలలో హెడ్ మాస్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అతి తక్కువ కాలంలో పాఠశాల రూపు రేఖలను మార్చి, విద్యార్థులకు అన్ని మౌళిక వసతులను కల్పించారు. పిల్లలను బడికి రప్పించడం కోసం వివిధ రకాల సంస్కృతి కార్యక్రమాలతో పాటు బోధనోపకారణాలతో తరగతి గదులను అందంగా అలంకరించి విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపిన టి మోహన్‌కు పదోన్నతి రావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# చెలరేగిన మట్టి మాఫియా..!

- అధికారుల సాక్షిగా ధ్వంసమైన ఏదులాపురం చెరువు
- భూమాత గుండెల్లో గుణపాలు దింపి రాత్రి, పగలు తోలకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టి లక్షలు కొల్లగొట్టిన అక్రమార్కులు
- రైతుల కోసం ఇచ్చిన అనుమతులను ఆసర చేసుకుని విధ్వంసం
- అడ్డగోలు దందాను నిలవరించలేకపోతున్న అధికారులు





**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** కంచె చేను మేసిన చందంగా ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. అడ్డగోలు వ్యవహారానికి మట్టి మాఫియాతో చేతులు కలిపి మామూళ్లు తీసుకుంటూ కళ్ళున్న కబోదుల్లా వ్యవహరించారు. ఇక తమకేవరు అడ్డులేరన్న రీతిలో చెలరేగిపోయిన మాఫియా వేల ట్రిప్పుల మట్టిని తరలించి లక్షల రూపాయాలను దండుకున్నారు. పెద్ద పెద్ద యంత్రాలతో భూమాతగుండెల్లో గుణపాలు దింపుతూ పగలు, రాత్రి తేడా లేకుండా చెరువు విధ్వంసానికి కారకులయ్యారు. అంతేకాకుండా చెరువు పక్కన ఉన్న ఆక్రమిత భూములకు మట్టిని పోసి యాథేచ్ఛగా కబ్జాలకు ఊతమిచ్చారు. రైతుల పంటపొలాలకు మట్టిని తోలుకునేందుకు ఇచ్చిన అనుమతులను ఆసరాగా చేసుకుని, అధికారులను మచ్చిక చేసుకుని విధ్వంసానికి ఒడిగట్టిన తీరు విస్మయానికి గురి చేస్తుంది.

ఖమ్మం జిల్లాకు కూత వేటుదూరంలో ఉన్న ఖమ్మం రూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామ చెరువులో మట్టి మాఫియా బరితెగించింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మట్టి మాఫియా చేసిన దాష్టీకంతో చెరువు నామరూపాలు లేకుండా పోయిందంటే అతిశయోక్తి కాదు. మట్టి మాఫియా కాసులకు కక్కుర్తిపడి చెరువు ఆయకట్టుపైనే మట్టిని తీసి పోయడంతో చెరువు కబ్జాకు గురయ్యింది. అసలు రైతుల భూముల్లోకి చెరువు మట్టి తోలుకునేందుకు అధికారుల ఇచ్చిన అనుమతులమాటున అడ్డగోలు వ్యవహరించారు. ఈ నేపథ్యంలో మట్టి మాఫియా అందివచ్చిన అవకాశాన్ని లక్షల్లో క్యాష్ చేసుకున్నారు. ఎటువంటి అనుమతలు లేకుండా మట్టిని తరలించి వెంచర్లకు, ఇండ్ల సముదాయాలకు తరలించారు. ట్రాక్టర్ అయితే రూ.1500, టిప్పర్ల ద్వారా రూ.4వేల చొప్పున దండుకున్నారు. ఇలా ఇప్పటి వరకు కొన్ని వేల ట్రిప్పుల మట్టిని తరలించి,సుమారు 8కోట్ల అక్రమ మట్టి వ్యాపారం నిర్వహించినట్లు బహిరంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఇరిగేషన్ అధికారులు అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకుని, అనుమతులు ఇచ్చినట్టయితే ప్రభుత్వానికి రూ.కోటి వరకు ఆదాయం వచ్చి ఉండేంది. ఇంత జరుగుతున్న అధికారులు మినిమేషలను లెక్కిస్తుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అనుమతుల మాటున అక్రమదందా...

రైతుల పంటలకు మట్టిని తరలించుకునేందుకు ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన అనుమతుల మాటున అక్రమదందా జోరుగాసాగుతుంది. రైతులకు తూతూమంత్రంగా మట్టిని పోసి అధికశాతం వెంచర్లు,ఇండ్ల సముదాయాలకు తరలించారు. ఏదులాపురం,పెద్దతండా,ముత్తగూడెం పంచాయతీ పరిధిలోని రియల్ వెంచర్లల్లో ఎక్కడ చూసిన నల్లమట్టి దర్శనం ఇస్తుందంటే ఎంత స్థాయిలో తొవ్వారు ఇట్టే అర్థమవుతుంది. అక్రమ మట్టి దందాలో ఇరిగేషన్ అధికారులు పాలుపంచుకోవడంతోనే చెరువు విధ్వంసం అయ్యిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. దందాపై అధికారులకు ఎంత చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదని, ఫిర్యాదు చేసిన వారి పేర్లను మట్టి మాఫియాకు చెబుతున్నారని వాపోతున్నారు. అక్రమార్కుల నుంచి పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకోవడంతోనే అటువైపు కన్నెత్తి చూడకుండా మాఫియాకు అండగా నిలిచి తమ చెరువు నామరూపాలు లేకుండా చేశారని, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### వెంచర్లు, ఇండ్ల సముదాయాలకు మట్టి...

చెరువు మట్టి సాగు భూములకు వినియోగిస్తుంటారు. ఎందుకంటే నల్లరేగడి మట్టిలో పంటలకు మంచి పౌష్టికత దొరుకుతుంది. కానీ ఇప్పుడు అదే మట్టిని వెంచర్లు, ఇండ్ల సుముదాయాలకు తరలించడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎందుకంటే నల్లరేగడి మట్టి పంటలకు బలాన్ని ఇస్తుంది తప్ప వెంచర్లకు పనికిరాదు. అయితే వెంచర్లకు కూత వేటుదూరంలో ఉండటంతో ఏదైతేనేమి మట్టే కాదా?అని రియాల్టర్లు ఆ మట్టిని వెంచర్లలో పోపించుకున్నారు. దీని వల్ల ఇండ్ల నిర్మాణం చేసుకున్న వారికి తీవ్ర నష్టాలు కలిగే అవకాశం ఉండనుందని పలువురు పేర్కొంటున్నారు. లక్షల రూపాయాలు వెచ్చించి సొంతిటి కళను నెరవేర్చుకుందాం అనుకున్న కొనుగోలు దారులను నిలువున మోసం చేస్తున్నారు. చెరువులో పెట్టిన పెద్దపెద్ద గోతులో నీరు నిండిన తర్వాత పెనుప్రమాదాలు సంభవించే సూచనలు పెద్ద ఎత్తున్న ఉన్నాయి. పెట్టిన గోతులతో మంచి నీళ్ల కోసం అందులోకి దిగిన మూగ జీవాలు దిగబడి మృత్యువాత పడవచ్చు. అలాగే చేపల వేటకు వెళ్లిన వారికి ముప్పులు కలిగే అవకాశం ఉంది.

### నిబంధనలకు తిలోదకాలు...

మట్టిని తరలించేందుకు ఇరిగేషన్, రెవిన్యూ, మైనింగ్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. చెరువుల నుంచైతే ఇరిగేషన్ ద్వారా పొంది అందులోని నిబంధనల మేరకు తోడాల్సి ఉంటుంది. కానీ ఏదులాపురం చెరువులో మట్టి తరలింపు విషయంలో నిబంధనలకు మట్టి మాఫియా తిలోదకాలు ఇచ్చింది. చెరువు మట్టి తరలింపు ఓ ఇరిగేషన్ అధికారి కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. ఇదిలా ఉండగా మట్టి మాఫియా నల్లరేగడి మట్టితో పాటు చెరువు గట్ల పక్కన ఉన్న మరంను పెద్ద ఎత్తున్న తరలించారు. ఏకంగా చెరువలో కబ్జా చేసిన ప్రాంతంలో వందల ట్రిప్పులను పోయడం వారి బరితెగింపుకు అద్దం పడుతుంది. అయినప్పటికీ రెవిన్యూ, మైనింగ్ అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చెరువు మట్టితో తమకు సంబంధం లేదని చెబుతున్నారే తప్ప మరం తోడంతో పాటు చెరువు కబ్జా చేస్తున్న పట్టించుకోవడం లేదు.

### పరిశీలన చేసి చర్యలు తీసుకుంటాం : మన్మధరావు, డీఈ ఐబీ ఇంఛార్జ్

అక్రమంగా మట్టి తోలకాలు జరుగుతున్నయన్న విషయం తమ దృష్టికి రావడంతో అక్కడ మా వర్క్ ఇన్స్పెక్టర్‌ను ఉంచాము. చెరువు మట్టి వెంచర్లు, ఇండ్ల సముదాయాలకు తరలి ఉంటే పరిశీలించి, తరలించిన వారిపై చర్యలు తీసుకుని నిబంధనల మేరకు డబ్బులను రికవరీ చేస్తాం. ఇప్పటికే అక్రమ మట్టి తరలింపు చేసిన వారిపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇచ్చి కేసులు నమోదు చేపించాము.

### అక్రమార్కులను బైండోవర్ చేస్తాం : రాజిరెడ్డి ఖమ్మం రూరల్ సిఐ

అక్రమ మట్టి తోలకాలు చేస్తున్న వారిపై ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశాము. వారిని తహశీల్దార్‌కు బైండోవర్ చేసి మరో మారు తప్పు చేయకుండా బాండ్ పేపర్‌పై లిఖితపూర్వకంగా హామీ తీసుకుంటారు. అయినప్పటికి అక్రమతోలకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాము.

## పల్లె ప్రకృతి వనాలు ఫుల్.. నిర్వహణ నిల్..!




### -కనుమరుగవుతున్న పల్లె ప్రకృతి వనాలు
### -మందుబాబులకు అడ్డాలుగా మారిన వైనం
### -90% ప్రజలకు తెలియని పంచాయతీ ప్రకృతి వనాలు



**ప్రజాపక్షం/దమ్మపేట:** ఏదో మొక్కలు నాటామా.. వదిలేశామా.. అన్నట్లుగా ఉంది దమ్మపేట మండలంలో ని పల్లె ప్రకృతి వనాల పరిస్థితి. పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసి తమ పని అయిపోయింది అని చేతులు దులుపుకొన్నట్లు ఉంది ప్రస్తుతం అధికారుల పని తీరు. పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తోంది. ఏదో ఊరు చివరన హడావుడిగా ఏర్పాటు చేసి వదిలేయడంతో.. అప్పుడే మైదాన ప్రాంతాలుగా మారిపోయి కనిపిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పల్లె వనాలపై పట్టింపే లేకుండా పోతోంది. లక్షలు వెచ్చించి గత రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి వనాలు కొన్ని గ్రామాల్లో ఆహ్లాదాన్ని పంచుతుంటే, మరి కొన్ని గ్రామాల్లో మొక్కలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన ఈ పల్లె ప్రకృతి వనాలు ప్రస్తుతందయనీయ స్థితిలో దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు పచ్చదనాన్ని పెంచి స్వచ్ఛమైన గాలిని ఇవ్వాలని ఉద్దేశంతో పల్లె ప్రకృతి వనాల ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ బాధ్యతలు గ్రామ పంచాయతీలకు అప్పగించగా వారు గాలికి వదిలేశారు. ఇటీవల కాలంలో గ్రామ సర్పంచ్ పదవీకాలం ముగియడంతో కనీసం పల్లె ప్రకృతి వనాల నిర్వహణ బాధ్యతలు చూసుకునే నాథుడే కరువయ్యాడు. హరితహారం పేరుతో ఈ పల్లె ప్రకృతి వనాల్లో చనిపోయినా మొక్కలు నాటే అవకాశం ఉన్నప్పటికీ ఆదిశగా ఆలోచించిన దాఖలాలు కూడా కనిపించటం లేదు. ఎక్కడిక్కడ మొక్కలు చనిపోయి నీరులేక ఎండిపోతున్నాయి. అక్కడక్కడ పల్లె ప్రకృతి వనాల్లో మొక్కలు నాటినా.. నెలలో ఒకటి, రెండు సార్లు కూడా మొక్కలకు నీరందిస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. మండలంలో చాలా చోట్ల పల్లె ప్రకృతి వనాలు బోర్డులు తప్ప మొక్కలు కనబడని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలను ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసి వాటి నిర్వహణ కోసం ప్రతి గ్రామపంచాయతీకి ట్రాక్టర్, నీటి ట్యాంకర్ ను అందించారు. ఉన్నతాధికారుల పర్యటన చేస్తున్న సందర్భాల్లోనే మొక్కలకు నీళ్లు పోస్తూ ఫొటోలకు ఫోజులిస్తున్నారు. ఆ తర్వాత అంతా షరా మాములుగా మారిపోతుంది. అధికారుల నిర్లక్ష్యంతో పల్లె ప్రకృతి వనాల పరిస్థితి అధ్వానంగా కనిపిస్తుంది. అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే మండల కేంద్రమైన మేజర్ పంచాయితీకి చెందిన పల్లె ప్రకృతి వనం ఎక్కడ వుందో కూడా గ్రామంలోని దాదాపు 90% ప్రజలకు తెలియదు అనే అతిశయోక్తి కాదేమో. ఇప్పుడు అక్కడి పరిస్థితులు అడవిని తలపించటమే కాకుండా, పాములకు ఆవాసంగా మారింది. గేట్లు ఊడిపోయి శిథిలావస్థకు చేరుకున్నాయి. లోపలికి అడుగుపెట్టాలి అంటేనే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. పల్లె ప్రకృతి వనాలు ప్రస్తుతం పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. రాజుల సొమ్ము రాళ్ల పాలు అన్న చందంగా అధికారుల తీరు మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాత్రయితే చాలు పల్లె ప్రకృతి వనాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మారి మందుబాబులతో బార్లను తలపిస్తున్నాయి. సాయంత్రం వేళలో ఆహ్లాదాన్ని పంచాల్సిన ప్రకృతి వనాలు మందు సీసాలతో, వాడి పారేసిన నిరోధ్ లు దర్శనం ఇస్తున్నాయి. దీనితో సామాన్యులు ఎవరు అటువైపుగా వెళ్ళటానికి సాహసించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక ఎమ్మెల్యే పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** స్థానిక సారపాక బ్రిలియంట్ విద్యా సంస్థ నందు అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. యోగా దినోత్సవంను పురస్కరించుకొని యోగా గురువులు ఏ ఆదిశేషులు, బి శ్రీనివాస్, వై శ్రావణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అనేక రకాల యోగాసనాల అభ్యసనం, ధ్యాన సాధనను చేపించారు. యోగా శరీరాన్ని మనస్సును ఏకం చేస్తుందని విద్యార్థులకు తెలిపారు. ఈసందర్భంగా బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ బిఎన్ఆర్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో మనిషి ఉరుకుల పరుగులు జీవితంలో ఒత్తిడిని తగ్గించుకునేందుకు యోగాసనాలు ధ్యానం వంటివి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఏకాగ్రత ఎంతగానో పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ యోగాను చేయడం అనేది మానవుని జీవన శైలిలో భాగంగా చేర్చుకోవాలని, అప్పుడు మాత్రమే ఒత్తిడి లేని జీవితాన్ని పొందగలమని తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా జయశంకర్ వర్ధంతి వేడుకలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఆచార్య కొత్తపల్లి జయశంకర్ వర్ధంతి వేడుకల సందర్భంగా మండల పరిధిలోని సారపాక ప్రధాన కూడలిలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళుర్పించారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, సారపాక పట్టణ అధ్యక్షులు కొనకంచి శ్రీనివాస్, మండల నాయకులు చుక్కపల్లి బాలాజీ, బిట్ర సాయిబాబా, బిఆర్‌టియు యూనియన్ అధ్యక్షులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, పట్టణ యూత్ అధ్యక్షులు సోము లక్ష్మి చైతన్యరెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వలదాసు సాలయ్య, నాయకులు బెజ్జంకి కనకాచారి, కనుకు వెంకటేశ్వర్లు, చట్టి ఆంజనేయులు, దాసరి మోహన్‌రావు, భూక్య క్రిష్ణ, అరుణ్ ప్రసాద్, సూదిపాక ఈశ్వర్, బొంతపల్లి రాము, సతీష్, రాజు, కోటమర్తి వెంకటేశ్వర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి

## జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అధికారులు, సిబ్బంది తమ తమ విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవస్థపై గట్టి నమ్మకం ఉన్నట్లు అందరు అధికారులు బాధ్యతాయుతంగా తమ తమ విధుల నిర్వహణ చేయాలన్నారు. పరిపాలనలో భాగంగా పథకాల అమలు, లబ్ది, చిట్టచివరి లబ్దిదారునికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైళ్ల నిర్వహణ అడిగి తెలుసుకున్నారు.జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులకు పర్సనల్ ఫైనాన్స్, ఇన్వెస్ట్‌మెంట్ పై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఉద్యోగులకు హెల్త్ క్యాంపు నిర్వహించి అందరి హెల్త్ ప్రోఫైల్ సేకరించనున్నట్లు దీనిపై పర్యవేక్షణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఆరోగ్యం ఎంతో ప్రధానమైందని ఆరోగ్యాన్ని, కుటుంబాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ విధుల నిర్వహణ చేయాలన్నారు. కార్యాలయాల సముదాయంలో డైనింగ్ హాల్, టాయిలెట్స్, తాగునీరు, కనీస మౌలిక సదుపాయాల కల్పన గురించి అడిగి తెలుసుకున్నారు. 100 శాతం ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలన్నారు. ప్లాస్టిక్ రహితంగా కార్యాలయ నిర్వహణ చేపట్టాలన్నారు. జిల్లా అధికారులను సమస్యల గురించి అడిగి కావాల్సిన సామాగ్రి చేపట్టాల్సిన చర్యలపై నివేదిక అందించాల్సిందిగా కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ అధికారులను పరిచయం చేసుకున్నారు. అధికారులు, సిబ్బంది కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం కలెక్టర్ భవన సముదాయమంతా కలియ తిరిగి కార్యాలయాలను పరిశీలించారు. సంక్షేమ అధికారి కార్యాలయం, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. భవన సముదాయంలో బ్యాంక్, ఏటిఎం ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. మీ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. అవసరాలను బట్టి కార్యాలయాల మార్పులు చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. రాజేశ్వరి, డిఆర్‌డివో సన్యాసయ్య, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ ఏవో అరుణ, కేర్‌టేకర్ వెంకన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞ పాఠశాలలో యోగా డే



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం వీడియోస్ కాలనీలోని సర్వజ్ఞ పాఠశాలలో యోగా డేను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత, దాని వల్ల కలిగే లాభాలను వివరించారు. విద్యార్థుల చే వివిధ రకాల ఆసనాలు వేయించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు నీలిమ, నాగేంద్రకుమార్ లు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగ నేడు ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందిందన్నారు. యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలిపారు. తమ పాఠశాలలో చదువుతో పాటు యోగా వంటి వాటికి ప్రాధాన్యతనిస్తామని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# న్యూవిజన్‌లో యోగా దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కలిగించే యోగాను రోజు వారి దైనందిన కార్యక్రమంలో ఒక భాగంగా చేసుకోవాలని న్యూవిజన్ పాఠశాల ప్రిన్సిపాల్ అబాద్ అలీ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని న్యూ విజన్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల చే యోగాసనాలు వేయించి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పాఠశాల ఉపాధ్యాయునిలు హరతి, లావణ్య, యోగా గురువు పుష్ప విద్యార్థుల చే యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో న్యూ విజన్ విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ సిహెచ్ కార్తీక్, ఉపాధ్యాయులు సంపత్, వాసంతి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటిలో ఘనంగా యోగా దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఎస్‌బిఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో యోగా గురువు ఝాన్సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ ఆసనాలలో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు మన దేశం అందించిన వర ప్రసాదం యోగా అన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో యోగా ఎంతో దోహదపడుతుందన్నారు. విద్యార్థులు చదువులో ఒత్తిడిని తగ్గించుకోవడానికి యోగా దివ్య ఔషధంగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరు తమ దినచర్యల్లో యోగాను చేర్చుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు తేజస్వి, లక్ష్మి ప్రసన్న, లక్ష్మి నాగేశ్వరి, ప్రవళిక, ఉదయశ్రీ, ఉమా లకు గుండాల కృష్ణ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి . ధాత్రి , ప్రిన్సిపాల్ డా॥ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ అమిత్ బిందాజ్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జి. ప్రవీణ్ కుమార్, జే. రవీంద్రబాబు, ఎన్. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో యోగా దినోత్సవం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీ నగర్ కాలనీలో గల రెజొనెన్స్ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగా యొక్క విశిష్టతను వివరిస్తూ విద్యార్థుల చే యోగాసనాలు వేయించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు కొండా శ్రీధర్ రావు, కృష్ణవేణి లు మాట్లాడుతూ 2015 నుండి ప్రతి ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. యోగా ద్వారా ఏకాగ్రత, క్రమశిక్షణ మెరుగుపర్చుకోవచ్చునని తెలిపారు. యోగా మతానికి సంబంధించి కాదని ఇది ఒక జీవన విధానం అన్నారు. మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే యోగాతో పాటు మంచి ఆహారపు అలవాట్లు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ప్రసన్నరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులకు ఉపయోగపడే రోడ్లను ఆక్రమిస్తే ఊరుకోం



**ప్రజాపక్షం/కరకగూడెం:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనేతరులను సోదరా భావంతో స్వేచ్ఛగా బ్రతుకనిస్తే రైతులకు ఉపయోగపడే రోడ్లను ఆక్రమిస్తే అంతు చూస్తామని మాజీ ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ ఛైర్మన్, ఆదివాసి ఉద్యమ నేత చందా లింగయ్య దొర హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో రైతులకు వ్యవసాయ పొలంలోకి వెళ్లడానికి వినియోగించే రోడ్డును గిరిజనేతరులు దున్నటం ఎంత వరకు సబమని ఇలానే చూసుకుంటూ పోతే గిరిజన ప్రాంతాలన్నీ గిరిజనేతరుల చెప్పు చేతల్లోకి పోవడం ఖాయమని గిరిజనేతరుల పోకడలకు వ్యతిరేకంగా ఆదివాసి ప్రజానీకం తలుచుకుంటే మండలంలో ఏ గిరిజనేతరుడైన ఆదివాసి చట్టాలకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో జీవించగలడాని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటివరకు ఏ ఒక్క గిరిజనేతరులను కూడా సోదరా భావం తోటే చూసామని ఇదే అదునుగా భావిస్తే మాత్రం పరిణామాలు తీవ్రంగా ఉంటాయని వారు హెచ్చరించారు. మండలంలో గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా అనేక భూ బదలాయింపులు, భవన నిర్మాణాలు కొనసాగుతున్న కలిసి మెలిసి బ్రతుకుతున్నామనే సోదరా భావం మాత్రమే ఇప్పటి వరకు ఏమీ చేయలేకపోయాయని ఇదే కొనసాగితే భవిష్యత్తులో ఉద్యమం తీవ్రతరం కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన అభ్యుదయ సంఘం మండల కన్వీనర్ గోగ్గల రవి, వజ్జా మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితుడు మృతి

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** మండలంలోని బైరవుని పల్లి గ్రామంలో ఓ వివాహిత ను హత్య చేసిన ఘటనలో నిందితుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం... వివరాలు ఇలా ఉన్నాయి.ఖమ్మంజిల్లాలోని నేలకొండపల్లి మండలంలోని బైరవునిపల్లి గ్రామంకు చెందిన వివాహిత ను ఈనెల ఏడున అదే గ్రామానికి చెందిన సొంటి శ్రీను (50) అనే వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. అదే రోజు తాను కూడా కత్తితో పొడుచుకుని ఆత్మహత్యాయత్నంకు పాల్పడ్డాడు. స్థానికులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శ్రీను శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కన్నులపండువగా కోర్సోజుల జాతర మహోత్సవం





**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** గిరిజనుల కుల దైవం కోర్సోజుల స్వామి జాతర మహోత్సవం కనులపండుగులా జరిగింది. నిప్పుల గుండాలను వందలాది మంది భక్తులు తొక్కుతూ వేలాది మంది భక్తుల మధ్య ప్రతిష్టాత్మకంగా జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్ పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనుల కుల దైవమైన శ్రీశ్రీశ్రీ చిన్న కోర్సోజుల స్వామి ఎంతో శక్తి సంపన్నుడైన దేవుడని,జాతర సమయాల్లో ఎన్నో నియమాలతో ఏడాదికోసారి ఈ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో స్వామి వారి జాతరలు జరుగుతాయని తెలిపారు. అనంతరం కొండ కోనలు గృహాల్లో ఈ దైవం కొలువు దీరుస్తారన్నారు. అటువంటి దేవుడు ప్రత్యేక భక్తిశ్రద్ధలతో పూజలు చేయటం వలన వర్షాలు పడి పాడి పంటలు, ప్రజలందరూ సుభిక్షంగా ఉంటారని అన్నారు. భక్తులందరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జాతర కమిటీ ఆధ్వర్యంలో అన్నవితరణను ప్రారంభించిన ఎమ్మెల్యే భక్తులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాల ప్రజలు, గ్రామస్థులు, బంధువులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం





**ప్రజాపక్షం/పినపాక:** యోగాతో శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని, వీటిపై అవగాహన పెంచుకోవడం కోసమే ప్రతి ఒక్కరూ ప్రపంచ యోగా దినోత్సవం జరుపుకోవాలని, పలు పాఠశాలలో విద్యార్థులకు యోగా డే సందర్భంగా అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేట్ కళాశాలల్లో, గ్రామపంచాయతీ కార్యాలయాల వద్ద శుక్రవారం ఉదయం యోగా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు యోగా గురువులు మాట్లాడుతూ యోగా అంటే కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదని, శ్వాస వ్యాయామాలతో కూడుకుని, మనుషులలో ఉన్నటువంటి ఒత్తిడిని, ఆందోళనను తగ్గించి, వారిని నిరాశ, నిస్పృహల నుండి బయటకు తీసుకురావడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జూన్ 21వ తేదీన ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నామని, ప్రపంచవ్యాప్తంగా యోగా దినోత్సవం జరుపుకుంటున్నప్పటికీ భారతదేశంలో యోగాకు ఆధ్యాత్మికంగా చాలా విశిష్టమైన స్థానాన్ని ఇచ్చారన్నారు.

# సార్.. లెటర్ ప్లీజ్..!

**-పోస్టింగుల కోసం పోలీసుల యత్నాలు**
**-ఎస్సై నుంచి ఏసిపి దాకా పైరవీలు**



**ప్రజాపక్షం/వైరా:** ఎన్నికల కోడ్ పూర్తికావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నేతలు ఇంటి వద్ద పలువురు పోలీసులు పోస్టింగులు కోసం పడరాని పాట్లు పడుతున్నారు. సార్ మీ పరిధిలో పోస్టింగు కోసం లెటర్ కావాలి ప్లీజ్ సార్ అంటున్నారు. లూప్ లైన్‌లో ఉన్నా వారు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. సార్ మీరరు లెటరిస్తే మీ పరిధిలో వెళ్లి పోస్టింగులో చేరతాం అంటూ పెద్ద ఎత్తున పైరవీలు ప్రారంభించారు. ఈ లెటర్ ప్రయత్నాలు కేవలం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకే పరిమితం కావడం లేదు. లెటర్ ప్లీజ్ సార్ సమస్యలు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలో ఇదే పరిస్థితి ఉంది. త్వరగా పోస్టింగులు తెచ్చుకోవాలని ఎక్కువ మంది పోలీసు అధికారులు ఎవరికి వారే పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నారు. కొన్ని పోలీస్‌స్టేషన్‌లలో పోస్టింగ్ అంటే హాట్‌కేక్, అలాంటి వాటి కోసం సామాజిక వర్గాల వారీగా కొంతమంది పోలీసు పైరవీలు ప్రారంభించారు. ఈ క్రమంలోనే నేతలు కూడా వారి సామాజిక వర్గాల అధికారులకు పెద్ద పీఠ వేసేందుకు కూడా మొగ్గుచూపుతున్నారు. విశ్వసనీయత వారితో పాత పరిచయాలు లాంటి వాటిని కూడా పరిశీలిస్తున్నారు. పోలీస్ అధికారుల్లో చాలా వరకు సొంత సామాజిక వర్గానికి చెందిన నాయకులను కలిసి సార్ లెటర్ల కోసం చేసే ప్రయత్నాల్లో బిజీగా ఉన్నారు. చాలా మంది పోలీసులు పిల్లల చదువుల కోసం పోస్టింగులు తెచ్చుకోవాలని చూస్తున్నారు. ఎన్నికల కోడ్ ముగిసింది. దీంతో తిరిగి వెనక్కి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. లూప్‌లైన్‌లో ఉన్నవారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో పోస్టింగులు దక్కని వారు ఇప్పుడు ఎలాగైనా లా అండ్ ఆర్డర్‌లో ఉండేందుకు నాయకులను కలిసి లెటర్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న పలువురు అధికారులను ఎలక్షన్ కమీషన్ అసెంబ్లీ ఎన్నికల ముందు బదిలీ చేసింది. తర్వాత వారి స్థానాల్లో కొత్త అధికారులను నియమించి పార్లమెంటు ఎన్నికలు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాల కలెక్టర్లను మార్చింది. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తమను ఇబ్బంది పెట్టిన పోలీస్ పోస్టింగు లెటర్లు ఇవ్వవద్దని కొందరు నేతలు బహిరంగంగానే చెబుతున్నారని సమాచారం. పోలీసులు మాత్రం ఇవేం పట్టించుకోవడం లేదని, తమ డిపార్ట్‌మెంటు ప్రభుత్వం చెప్పినట్లు వింటుందే తప్ప తామే పార్టీ పక్షం ఉండమని స్పష్టం చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికి సార్ లెటర్లు ఎవరికి వస్తుందో ఎక్కడ పోస్టింగ్ ఇస్తారో వేచిచూడాల్సిందే.

# బ్యాంకు అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలి

**ప్రజాపక్షం/వైరా:** బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతుకు రుణమాఫి చేయాలని, షరతులు పెట్టి రైతులను రుణమాఫి రైతు భరోసాలో కుదించే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. కౌలు రైతులకు భరోసా గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో వైరా తహశీల్దార్ కార్యాలయం వద్ద రైతులు ధర్నా నిర్వహించి తహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు బ్యాంకు వ్యవసాయ రుణాలు రూ.2లక్షలు మాఫి చేస్తామని కాంగ్రెస్ పార్టీ అధినేత రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు. కౌలు రైతులకు భరోసా ఇస్తామని హామీ ఎలాంటి మినహాయింపు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫి విషయంలో ఐటి ప్లేయర్స్‌రేషన్‌కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం నిబంధనలు విధించి రైతుల కుదించే ప్రయత్నం రాష్ట్ర ప్రభుత్వం నిర్మించుకోవాలని బ్యాంకులో అప్పు ఉన్న ప్రతి రైతు రుణాన్ని మాఫి చచేయాలని, బంగారం బ్యాంకులో తాకట్టు పెట్టి వ్యవసాయ రుణాలు తీసుకున్న రైతులకు కూడా సంపూర్ణంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర



ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ యోజనా నిబంధనలు రుణమాఫిలో రైతు భరోసా అమలులో చేయాలని చూస్తే రైతుల నుంచి ప్రతి ఘటన తప్పదని హెచ్చరించారు. కౌలు రైతులకు బాండు లేకుండానే గుర్తింపు కార్డులు జారీ చేసి రైతు భరోసా, రైతుభీమా బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం వైరా పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు, మేడా శరబంది, తోట నాగేశ్వరరావు, పైడిపల్లి సాంబశివరావు, యనమద్ది రామకృష్ణ, మాడపాటి మల్లికార్జున్, సంక్రాంతి పురుషోత్తం, షేక్ బాబు, ఇమ్మడి సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండలం లింగాల గ్రామం వద్ద గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ ఇప్పించినందుకు శుక్రవారం కల్లూరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే రాగమయి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ప్రజల వినతి మేరకు తుమ్మల ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి ప్రదాత లు తుమ్మల నాగేశ్వరరావు, రాగమయి గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ ఇప్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా వారికి కల్లూరు మండలం విజయవాడ సత్తుపల్లి రహదారి మధ్యలో వేంసూరు వద్ద మరియు కల్లూరు వద్ద ఎగ్జిట్ ఏర్పాటు అనుమతుకు ఇచ్చారు. ఈ ప్రాంత ప్రజలు హర్షంవ్యక్తం చేస్తూ ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకర్ రావు, దేవరపల్లి వెంకటేశ్వరరావు, తల్లాడ మండల



నాయకులు దిరిశాల నరసింహారావు, నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి మండల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. బైర్ల కాంతారావు, ఉస్మాన్, మచ్చ వెంకటేశ్వరరావు, మర్సకట్ల బాలరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని మిఠాయిలు పంపకం చేశారు.

# పాఠశాలల్లో యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పలు పాఠశాలల్లో యోగా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులు చిన్న కోరుకొండి, కొర్లగూడెం తదితర పాఠశాలలో యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు యోగా పై అవగాహన కల్పించారు. కొర్లగూడెంలో కోడిశాన విజయకుమార్, చిన్న కోరుకొండి పెద్ద కోరుకొండి లలోకృష్ణమూర్తి రమణయ్య ,విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆధునిక ప్రపంచంలో రాణించాలంటే పోటీ తత్వం పెరిగిందని ఉరుకులు, పరుకులు, జీవన విధానం తప్పనిసరిగా మారిందని పేర్కొన్నారు. ప్రతిరోజు యోగా చేయడం వల్ల శారీరకంగా మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని వయసుతో సంబంధం లేకుండా యోగా చేయవచ్చని యోగాసనాలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు పూర్తిస్థా



యిలో పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మతోన్మాదం దేశానికి ప్రమాదకరం

**ప్రజాపక్షం/ బోనకల్ :** దేశంలో ప్రధాని మోడి నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం అవలంభిస్తున్న మతోన్మాద విధానం ఎంతో ప్రమాదకరమని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని జానకిపురం గ్రామంలో తేజ పంక్షన్ హాల్‌లో సిపిఎం మండల కమిటీ



ఆధ్వర్యంలో రాజకీయ శిక్షణా తరగతులుప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత భారత రాజ్యాంగంలో సోషలిస్ట్ అనే పదాన్ని తొలగించిందన్నారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద విధానాల వలన మన భారత రాజ్యాంగం ప్రమాదంలో పడుబోతుందని హెచ్చరించారు. అనంతరం వర్తమాన రాజకీయాలు పరిస్థితులు, పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెర్వు కోటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, మండల నాయకులు, పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో యోగా దినోత్సవం

**ప్రజాపక్షం/ చింతకాని :** చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని శ్రీ గ్లోబల్ హైస్కూల్‌లో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల చిన్నారులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఇ.దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ



ప్రపంచానికి మన భారతదేశం యోగాను వర ప్రసాదంగా అందించిందని అన్నారు. శారీరకంగా, మానసికంగా ఒత్తిడి తగ్గించడానికి యోగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మోటార్‌సైకిల్, ఆర్‌టిసి బస్సు ఢీ

## యువకుడికి గాయాలు

**ప్రజాపక్షం/కారేపల్లి:** మోటార్ సైకిల్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ఘటన సింగరేణి మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు కారేపల్లి నుంచి మాదారం వెళుతున్న ఆర్‌టిసి బస్సు చిన్నకట్టుగూడెం గ్రామ సమీపంలో అటువైపుగా వస్తున్న మోటార్ సైకిల్‌ని ఢీకొనడంతో మోటార్‌సైకిల్ నడుపుతున్న యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కారేపల్లి హాస్పిటల్‌కి తరలించారు. గాయాలపాలైన యువకుడు గంపెల్లగూడెం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం



ఇవ్వడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆర్‌టిసి బస్సు అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిసింది.

# చినుకు పడితే చిత్తడే..

**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం ఉమ్మడి పంచాయతీలో గల కొత్తగా ఏర్పడిన కొత్త తండా గ్రామపంచాయతీ పరిధిలో రోడ్డు చినుకు పడితే రోడ్డు చిత్తడిమయమవుతుంది. ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ టౌన్షిప్ నుండి కొత్త తండా పంచాయతీ కార్యాలయం వరకు ఈ



పరిస్థితి ఎదురవుతుంది. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు నిర్మాణ పనులు చేయాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# యోగాతో మానసిక రుగ్మతలు దూరం



**ప్రజాపక్షం/ మధిర :** యోగాతో మానసిక, శారీరక రుగ్మతలు దూరమవుతాయని యోగా గురూజి నాళ్ళ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మధిర కలయిక వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయ న మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా విశిష్టతను వివరించారు. ప్రతిఒక్కరూ యోగాపై అవగాహన కలిగి ఉండాలని, మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం గంట యోగా చేయటం ద్వారా అనేక మానసిక, శారీరక రుగ్మతలు దూరమై మనిషికి ప్రశాంతత లభిస్తుందన్నారు. గత 20 సంవత్సరాలుగా నిత్యం ఎంతో మందికి యోగా సాధనను నేర్పుతున్న గురూజీ నాళ్ల శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఇరుకుళ్ళ బాలకోటేశ్వరరావు, కార్యదర్శి పరాంకుశం, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**




**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయితీ రాజ్, ఆర్అండ్‌బి, మున్సిపల్, సిపిఎస్ డబ్ల్యూ, ఐడిసి ఇఇలతో వీడియో కాన్ఫిరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఓ697 పాఠశాలల్లో పనులు పూర్తి చేసే విధానంపై ఇంజనీర్లుకు పలు సూచనలు చేశారు. పాఠశాలల్లో తాగునీరు, మిషన్ భగీరథ, నీటిని అందించకుండా సెడ్మెట్ ఫిల్టర్ నీటిని అందించాలన్నారు. దీని వల్ల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించినట్లు అవుతుందన్నారు. ఎలక్ట్రికల్ పనులు వెంటనే పూర్తి చేయాలని, టాయిలెట్లలో ఫోరింగ్ మాత్రమే చేయాలని, పైకప్పులు కారకుండా చూడాలని, పర్యావరణ పరిక్షణలో భాగంగా పాఠశాల ఆవరణలో ఎత్తైన చెట్లు నాటాలన్నారు. ఆరోగ్య రిత్యా తులసి ఇన్సులిన్ ప్లాంట్లు, రణపాల, నేల ఉసిరి, తిప్పతీగ మొక్కలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు ఇంజనీరింగ్ శాఖల అధికారులతో పాటు పదితరులు పాల్గొన్నారు.

# యోగాను అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పోలీసులు విధి నిర్వహణలో భాగంగా యోగాను అలవర్చుకోవాలని అడిషనల్ ఎస్పి ఆపరేషన్స్ సాయి మనోహర్ అన్నారు. యోగా డే సందర్భంగా గురువారం పోలీస్ హెడ్ క్వార్టర్స్ హేమచంద్రాపురంలో సిబ్బందికి యోగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా సాధన ద్వారా ఒత్తిడిని తగ్గించుకునే అవకాశం ఉంటుందని, తద్వారా మానసిక ప్రశాంతత దొరుకుతుందన్నారు. శరీరకంగా మానసికంగా ధృడంగా ఉంటారని చెప్పారు. యోగాను ఒలంపిక్స్‌లో ఓ క్రీడగా ప్రవేశపెట్టేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బి ఇన్స్‌పెక్టర్ నాగరాజు, ఎంటిఓ సుధాకర్, ఆర్ఐ ఆపరేషన్స్ రవి, అడ్మిన్ ఆర్ఐ లాల్‌బాబు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, నాగేశ్వరరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను కలిసిన కమిషనర్ వేణు



**ప్రజాపక్షం/వైరాః** ఖమ్మం జిల్లా కలెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను శుక్రవారం వైరా మున్సిపాల్ కమీషనర్ సిహెచ్.వేణు కలిసి పుష్ప గుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాల్ ఆర్ఐ ప్రదీప్, శానిటేషన్ అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## వైరాలో ఘనంగా యోగా దినోత్సవం




**ప్రజాపక్షం/వైరాః** వైరాలో ఎస్ఎస్‌వై యోగ వైరా సభ్యులు ఆధ్వర్యంలో, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌వైయోగ వైరా సభ్యులు వైరాపట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఉపధ్యాయురాలు మల్లేశ్వరి విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. చిన్ననాటి నుండే యోగ చేయడం వలన మంచి ఆరోగ్యాన్ని జ్ఞాపకశక్తిని పెంపొందించుకోవచ్చని పలువురు తెలిపారు. చదువుతో పాటు ఆటలు యోగాను పెంపొందించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థులతో యోగాసానాలు వేయించారు. ఈ కార్యక్రమంలో వైరా యోగ వైరా సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను కలిసిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/వైరాః** ఖమ్మం కలెక్టరేట్ నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌ను శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, వైరా సహకార సంఘ అధ్యక్షులు బొర్రా రాజశేఖర్, వైరా మండల కాంగ్రేస్‌ప ఆర్టీ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, పిసిసి కార్యదర్శి కట్ల రంగారావు, పగడాల మంజుల, కొణిజర్ల ఎంపిపి గోసు మధు, దార్న రాజశేఖర్, కోసూరి శ్రీను, బిడికె.రత్నం, మచ్చా బుజ్జి, పుచ్చకాయల వీరభద్రం, బోళ్ళ గంగారావు, పమ్మి అశోక్, కట్ల సంతోష్, స్వర్ణ నరేంద్ర, షేక్ హుస్సేన్, రామ్మూర్తినాయక్, ఆది ఆనందరావు తదితరులు కలెక్టర్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు.

## కల్లూరు రెవెన్యూ డివిజన్‌కు సబ్ కలెక్టర్ హోదా



**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు రెవెన్యూ డివిజన్ కు సబ్ కలెక్టర్ హోదా కల్పిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు శుక్రవారం అందాయి. పరిపాలన సౌల భ్యం దృష్ట్యా రాష్ట్రంలోని 15 రెవెన్యూ డివిజన్ లలోఆర్డీవోలకు బదులుగా ఐఏఎస్ కేడర్ అధికారులను ప్రభుత్వం త్వరలో నియమించడం జరుగుతుందని ఆర్డిఓ రాజేంద్ర గౌడ్ తెలిపారు. దీనిలో భాగంగా శుక్రవారం ప్రభుత్వం నుంచి కల్లూరు ఆర్డీవో కార్యాలయం అప్‌గ్రేడ్ చేస్తున్నట్లు ఆదేశాలు అందాయని పేర్కొన్నారు. త్వరలో ఈ డివిజన్లో ఐఏఎస్ ల పాలన కొనసాగుతుందని పేర్కొన్నారు. త్వరలో ఆర్డీవో స్థానంలో ఐఏఎస్ క్యాడర్ కలిగిన అధికారి రానున్నట్లు తెలిపారు. దీనివలన ఏన్కూరు, తల్లాడ, కల్లూరు ,పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, మండలాలు ఐఏఎస్ క్యాడర్ కలిగిన పరిపాలనలోకి రాబోతుంది.

## మహానీయుడు కొత్తపల్లి జయశంకర్



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జయశంకర్ తెలంగాణ ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మధిర ఎఎంసి మాజీ చైర్మన్ చిత్తారు నాగేశ్వరరావు, సొసైటీ చైర్మన బిక్కి ప్రసాద్, బిఆర్ఎస్ టౌన్ కార్యదర్శి అరిగె శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొగ్గుల భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్లు యన్నంశెట్టి అప్పారావు, సయ్యద్ ఇక్బాల్, నాయకులు కటికల సత్యనారాయణరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, ఆళ్ల నాగబాబు, బత్తుల శ్రీనివాసరావు, గుగులోత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ సిటీలో యోగా డే



**ప్రజాపక్షం/ ఖమ్మం రూరల్ :** అంతర్జాతీయ యోగా డే దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీ సిటీ అన్నపూర్ణ నిలయంలో యోగా డేను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి యో గా విశిష్టతను వివరించారు. మారిన కాలమాన పరిస్థితుల్లో ఆరోగ్యపు అలవాట్లు దైనందిన జీవితంలో వ్యవహరించాల్సిన తీరును ఈ సందర్భంగా తెలియజేశారు. యోగా పురాతనమైన ఆరోగ్య సాధనమని వారు తెలిపారు. యోగా తో దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలను సైతం పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా యోగా చేస్తే అద్భుత ఫలితాలను సాధించవచ్చునన్నా. కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ లత, విజయలక్ష్మి , ప్రమీల, పద్మజ, వెంకటరమణ, అనంతలక్ష్మి ,మమత, సుష్మా, వేద పాల్గొన్నారు.

## స్మార్ట్‌కిడ్జ్‌లో ఘనంగా యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం యోగా దినోత్సవ సందర్భంగా పాఠశాల చిన్నారులు యోగాసనాలు, సూర్య నమస్కారాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ప్రపంచానికి మన దేశం యోగాను వర ప్రసాదంగా అందించిందన్నారు. శారీరకంగా, మానసికంగా ఒత్తిడిని తగ్గించడానికి యోగా దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్లూమింగ్ మైండ్స్‌లో యోగా దినోత్సవం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం యోగా దినోత్సవ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో యోగా గురువు చేత విద్యార్థులకు యోగాసనాలు చేయించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి మాట్లాడుతూ యోగా యొక్క విశిష్టతను విద్యార్థులకు వివరించారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. యోగాను ఒక అలవాటుగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ జి. ప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జయశంకర్ వర్ధంతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొ॥ జయశంకర్ వర్ధంతి ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జయ శంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పార్టీ సీనియర్ నాయకులు ఆర్‌జెసి కృష్ణ, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌జెసి మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణరాష్ట్రం కోసం ప్రొ॥ జయశంకర్ ఎంతగానో కృషి చేశారన్నారు.విద్యావేత్తగా ప్రజల్లో తెలంగాణ కాంక్షను ఆయన రగిలించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పాల వెంకటరమణ, కార్పొరేటర్ బుర్రి వెంకటకుమార్, బత్తుల మురళి, దోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, షేక్ షకీనా, జక్కుల లక్ష్మయ్య, బుడాన్, అహ్మద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.65 లక్షల గంజాయి పట్టివేత



**ప్రజాపక్షం/భద్రాచలం :** అక్రమంగా తరలించుకు పోతున్న రూ.65 లక్షల విలువ చేసే 228 కేజీల గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్మెంట్ అధికారులు పట్టుకున్నారు. శుక్రవారం ఒడిస్సా నుండి భద్రాచలం మీదుగా ఓ వాహనం అతివేంగా టిఎన్ 05 బిపి 1495 నెంబర్ గల కారు వెళుతోంది. అనుమానం వచ్చిన అధికారులు ఆ కారును ఆర్‌టిఏ చెక్ పోస్టు వద్ద ఆపే ప్రయత్నం చేయగా తప్పించుకుని దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం గ్రామంలో వెంటపడి పట్టుకున్నారు. కారును తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. గంజాయితో పాటు బంగ్లాదేశ్, శ్రీలంక కరెన్సీ కూడా లభ్యమైంది. గంజాయితో పాటు వాహనంను స్వాదీనం చేసుకున్న అధికారులు, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.